ప్రజాశక్తి

శుక్రవారం 28 జూన్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



కూల్చేసిన విలేకరి ఇల్లు

టిడిపి నేతల ప్రతీకార దాడులు

- చెరుకుపల్లిలో ఓ విలేకరి గృహం కూల్చివేత..
- రాంబొట్లపాలెంపై దళిత యువకుడిపై దాడి
- గర్భిణీని కూడా నిర్బంధించిన నాయకులు

2లో

తొలి ప్రాధాన్యత

ప్రజాసమస్యల పరిష్కారానికే..



- వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ
- తాగునీటి సమస్యల పరిష్కారానికి యాక్షన్ ప్లాన్
- అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి
- బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజాసమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమని, మీకోసం అర్జీలను సకాలంలో పరిష్కరిస్తానని కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా తెలిపారు. శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ప్రకాశం జిల్లాకు 38వ కలెక్టర్గా నియమితులైన ఆమె గురువారం ఉదయం ప్రకాశం భవనంలో బాధ్యతలు స్వీకరించారు. సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, జిల్లా ఎస్పి గరుడ్ సుమీత్ సునీల్, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు జివి సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్ ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివద్ధి పనులు వేగవంతానికి చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో వెలిగొండ. ప్రాజెక్ట్ను వేగవంతంగా పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. జిల్లాలో ఉన్న తాగునీటి సమస్యల పరిష్కారానికి 2లో



కుటుంబసభ్యులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా

లైంగిక వేధింపులకు పాల్పడిన..

డిఎల్పిఒ నాగేశ్వరరావు సస్పెన్షన్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారి నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. తన కార్యాలయంలో పనిచేసే మహిళ ఉద్యోగి పట్ల ఆయన అనుచితంగా ప్రవర్తించినట్లు నిర్ధారించిన విచారణ అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ సిఫారసు మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖ కమిషనర్ కన్నబాబు డిఎల్పిఒను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.



డిఎల్పిఒ నాగేశ్వరరావు

మీరు తప్పుకోండి..మా వాళ్లు వస్తారు.!

- ఒఎంసిలో మేస్త్రీలకు మొదలైన సంకేతాలు
- కోవిడ్ కార్మికుల్లో కూడా కొంతమందిని మార్చుకునేలా పావులు
- టిడిపి ప్రభుత్వం వచ్చాక ఒఎంసి శానిటేషన్ విభాగంలో మొదలైన అలజడి
- పరిస్థితులను ఆరా తీస్తున్న మేయర్..



ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'మీలో ఎవ్వరూ పనిచేయడం లేదు.. పెత్తనం చేస్తున్నారు. చేస్తే పని చేయండి.. లేకుంటే తప్పుకోండి.. ఆ స్థానంలో మా వాళ్లను పెట్టుకుంటాం.' అని నగరపాలక సంస్థలో పనిచేసే పలువురు శానిటరి మేస్త్రీల మీద ఒత్తిడి వస్తున్నట్లు తెలిసింది. ఇటీవల తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఒంగోలు నగరపాలక సంస్థలోని శానిటేషన్ విభాగంలో కొంత అలజడి కనిపిస్తోంది. ఈ విభాగంలో పనిచేసే మేస్త్రీలు కొంతమంది సక్రమంగా పనిచేయడం లేదనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. దీంతో వారు చేస్తే పారిశుధ్య కార్మికుడి పనిచేయాలని, లేని పక్షంలో విధుల నుంచి తప్పుకోవాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో మొత్తం 681 మంది ఆప్కాస్ కార్మికులు ఉన్నారు. కోవిడ్ కార్మికులుగా మరో 150 మంది విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం 831 మంది కార్మికులు ఉంటే వీరిలో సుమారు 100 మంది శానిటేషన్ మేస్త్రీలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ 100 మంది మేస్త్రీలలో సగానికి సగం మంది అస్సలు ఎక్కడ పనిచేస్తున్నారో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయనేది తెలుగుదేశం పార్టీ నేతల ఆరోపణ. కొంతమంది మేస్త్రీలు వైసిపి నాయకుల వద్ద వ్యక్తిగత పనులు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జీతం మున్సిపాలిటీ నుంచి పొందుతూ పనులు వేరే చోట చేస్తున్నారనేది బలమైన ఆరోపణ. ఈ నేపథ్యంలో అలాంటి వారిమీద టిడిపి నాయకులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ పాటికే అలాంటి వారి జాబితాను కూడా సిద్ధం చేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. కార్పొరేషన్ పని చేయకుండా పబ్బం గడిపే వారిని వెంటనే విధులకు పంపాలని, లేనిపక్షంలో వారి స్థానంలో తమ వారిని విధుల్లో పెట్టుకోవాలని శానిటరి ఇన్స్పెక్టర్ల మీద అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అయితే శానిటరీ మేస్త్రీలలో ఆప్కాస్ వాళ్ల ఎక్కువగా ఉండటంతో వారిని తొలగించడం కార్పొరేషన్ దిగువస్థాయి సిబ్బంది చేతిలో ఉండదు. కార్పొరేషన్ కమిషనర్ ద్వారా సిఫార్సు చేస్తే దాన్ని ఆప్కాస్కు చైర్మన్గా ఉన్న కలెక్టర్ ఆమోదించాల్సి ఉంటుంది. తొలగించిన వారి స్థానంలో కొత్తవారిని నియమించుకోవాలన్నా కలెక్టరే ఆమోదం తెలపాల్సి ఉంటుంది. దీంతో ఆప్కాస్లో కొంతమంది మేస్త్రీలను తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న సాంకేతిక పరమైన అంశాలమీద కూడా టిడిపి నాయకులు దృష్టి పెట్టారని తెలిసింది.

కోవిడ్ కార్మికులకు ఎసరు.?

పనిలో పనిగా కోవిడ్ కార్మికుల జాబితాలో కూడా మార్పులు, చేర్పులు చేయాలనే దిశగా అధికార పార్టీ నేతలు 2లో

పింఛన్ నగదును

ఇంటింటికీ వెళ్లి అందజేయాలి

- వీక్షణ సమావేశంలో మంత్రులు గొట్టిపాటి, అనగాని



వీక్షణ సమావేశంలో పాల్గొన్న ఇన్ఛార్జి కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం నగదును ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ గురువారం వీక్షణ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రులు, జిల్లాలోని శాసనసభ్యులు పాల్గొని మాట్లాడారు. మంత్రులు రవికుమార్, సత్యప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ను పెంచి ప్రజలకు ఇస్తుందని చెప్పారు. జూలై ఒకటో తేదీన సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ నుంచి పెరిగిన పింఛన్ సొమ్ము, జూలై పెన్షన్ కలిపి రూ.7000 లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. 11 రకాల కేటగిరీలలోని లబ్ధిదారులకు పింఛన్ రెండింతలు అయ్యిందన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు వివరించాలన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. పండుగ వాతావరణంలో పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఉద్యోగులంతా కలిసి పని చేయాలని సూచించారు. తప్పులు జరగకుండా, పింఛన్ సొమ్ము పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో వాలంటీర్లను దగ్గరకు రానివ్వరాదన్నారు. షామియానాలు వేయడం, లబ్ధిదారులందరినీ ఒకే చోటకు తెచ్చి సభలు నిర్వహించడం వంటివి చేయరాదన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇవ్వాలన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం లబ్ధిదారులకు సక్రమంగా నగదు పంపిణీ చేయాలని జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ఆదేశించారు. నూరుశాతం 2లో

టిడిపి నేతల ప్రతీకార దాడులు

- చెరుకుపల్లిలో విలేకరి గృహం కూల్చివేత..
- రాంబొట్లపాలెంపై దళిత యువకుడిపై దాడి
- గర్భిణీని కూడా నిర్బంధించిన నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

టిడిపి అధికారంలోకి వచ్చి నెల కూడా కాక ముందే ఆ పార్టీ నేతలు ప్రతీకార దాడులకు పాల్పడుతున్నారు. చెరుకుపల్లి మండలంలో రెండు చోట్ల టిడిపి నేతలు అరాచకానికి పాల్పడ్డారు. చెరుకుపల్లిలో ఓ విలేకరి ఇంటిని కూల్చేయగా.. ఈ మండలంలోనే రాంబట్లపాలెం గ్రామానికి చెందిన దళిత నాయకుడు రాజ్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. గర్భిణీ అయిన అతని భార్యను నిర్బంధించి మరీ దళిత నేతలపై దాడికి పాల్పడటం చర్చనీయాంశమైంది.

చెరుకుపల్లి గ్రామానికి చెందిన ఒక పత్రిక విలేకరికి చెందిన గ్రామ కంఠంలో నిర్మించిన గృహాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం సాయంత్రం కూల్చివేశారు. గ్రామ కంఠంలో ఇటీవల నూతనంగా రేకుల షెడ్డు నిర్మించుకోగా గ్రామానికి చెందిన నాయకులు దగ్గరుండి కూల్చి వేయించారని బాధితుడు యేనుమల వెంకటేశ్వరరావు గౌడ్ తెలిపారు. గ్రామ కంఠానికి చెందిన భూమిలో 40కి పైగా కుటుంబాలు నివా సం ఉంటుండగా తనకు చెందిన నివాస గృహాన్ని మాత్రమే అక్రమంగా కూల్చి వేయించారని తెలిపారు. గత ప్రభుత్వం లో సదరు విలేకరి వైసిపి నాయకులకు అనుకూలంగా వ్యవహరించారనే ఈ కూల్చివేత జరిగినట్లు తెలుస్తోంది.

దళిత నేతపై దాడి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలు, ఎన్నికల సందర్భంగా జరిగిన వివాదాల నేపథ్యంలో చెరుకుపల్లి మండలం, రాంబొట్లపాలెం గ్రామానికి చెందిన వైసిపికి చెందిన దళిత నాయకుడు రాజ్‌కుమార్‌పై టిడిపి నేతలు అతని ఇంట్లోనే దాడి చేశారు. గర్భవతి అయిన అతని భార్యను నిర్బంధించి దాడి చేసిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో అధికారంలో ఉండగా దళిత నేత తమను ఇబ్బంది పెట్టాడనే కారణంతో తెలుగుదేశం పార్టీ నాయకులు మూడు రోజుల క్రితం రాజ్‌కుమార్‌పై విరుచుకుపడ్డారు. అతని ఇంట్లో అతని భార్యను నిర్బంధించి మరీ రాజ్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. గ్రామం నుంచి వెళ్లిపోవాలని దుర్భాషలాడినట్లు బాధితులు వాపోయారు. గాయాలపాలైన రాజకుమార్ దంపతులను రాజ్య సభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు సోదరుడు మోపిదేవి హరినాథ్‌బాబు రేపల్లె ఆసుపత్రిలో చేర్పించారు.

ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

తొలి రోజే నగదు పంపిణీ చేయాలని, సాంకేతిక కారణాలు ఎదురైతే మిగిలినవన్నీ రెండో తేదీన పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పింఛన్ పంపిణీలో విధులు నిర్వర్తించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి 50 మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు ఇచ్చేలా మ్యాపింగ్ చేయాలన్నారు. ఒకటో తేదీ సోమవారం ఉదయం ఆరు గంటలకు పింఛన్ నగదు పంపిణీ ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఈ నెల 29న అన్ని ప్రాంతాలలో బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలన్నారు. జిల్లాలో 2,33,599 మంది లబ్ధిదారులుండగా 2,33,100 మంది ఇళ్లకు వెళ్లి నగదు అందజేస్తామని, మిగిలిన వారికి నేరుగా పంపిణీ చేయాలన్నారు. ఇందుకోసం జిల్లాకు రూ.157 కోట్ల నగదు విడుదలైందన్నారు. ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల బయోమెట్రిక్, ఐరిష్, ఉద్యోగుల ధ్రువీకరణతోనే నగదు అందజేయాలన్నారు. పింఛన్ పంపిణీలో వాలంటీర్ల జోక్యం ఉండరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు ఉద్యోగులపై క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులకు మేలు జరిగే లక్ష్యంతోనే పనిచేయాలన్నారు. జిల్లాలో 477 సచివాలయాలు ఉన్నాయని, అందులో 4,307 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. నగదు పంపిణీకి ఉద్యోగుల కొరత ఏర్పడితే ఏ శాఖ ఉద్యోగులనైనా విధుల్లోకి తీసుకోవచ్చన్నారు. సమావేశంలో బాపట్ల, వేమూరు, పర్చూరు, చీరాల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు, ఎం మాలకొండయ్య, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, డిఆర్‌డిఎ పీడీ వై.పిచ్చిరెడ్డి, ఎల్‌డిఎం శివకృష్ణ, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె తక్కెళ్లపాడు గ్రామంలో మండల విద్యాశాఖాధికారులు టి రవి, ఇవి రమణయ్య, సమగ్ర శిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం రమేష్, సర్పంచ్ కె రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓలు మట్లాడుతూ బడి ఈడు కలిగిన పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నల్లూరి కోటేశ్వరరావు విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు, వెంకట రమణారావు, క్రాంతి కుమార్, పేరెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం, సిబ్బంది

ఇంటర్ పరీక్షల్లో 'వీరిశెట్టి' విజయకేతనం

ప్రజాశక్తి-పొదిలి

బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలలో పట్టణంలోని శ్రీ వీరిశెట్టి జూనియర్ కాలేజీ విద్యార్థులు మంచి ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారు. ప్రథమ సంవత్సరం బెటర్‌మెంట్ పరీక్షా ఫలితాలలో ఎంపిసి గ్రూప్‌లో గుంటూరి రమ్యకృష్ణ 464/470 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకును, పొదిలి పట్టణంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ గ్రూప్‌లో ఎస్‌కెజి నజీర భాను 460/470, కె రోహిత్ కుమార్ 457/470 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో టి స్నేహ రెడ్డి 429/440, సిఇసి విభాగంలో ఎస్‌వి పద్మ 466/500, పి నందిని 459/500 మార్కులను సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎం శ్రీనివాసులు, డైరెక్టర్ వి కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నరసింహారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి శ్రీను, బెల్లంకొండ విద్యాసంస్థల కరస్పాండెంట్ బెల్లంకొండ శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

తొలి ప్రాధాన్యత.. ప్రజా సమస్యల పరిష్కారానికే..

(మొదటిపేజీ తరువాయి)

కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఇతర సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా అవగాహన పెంచుకొని జిల్లాస్థాయిలో పరిష్కరించ గలిగినవి పరిష్కరిస్తూ.. మిగిలినవి ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. విద్య, వైద్యం, పారిశుధ్యం, నైపుణ్యాభివద్ధి, మహిళా సాధికారత కోసం ప్రత్యేక శ్రద్ధ పెడతామ న్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివద్ధి పథకాలను ప్రజలకు చేరవేసి ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలిపేందుకు కషి చేస్తానని ఆమె తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వారికి అన్ని వేళలా అందు బాటులో ఉంటానని చెప్పారు. జిల్లా ప్రజలు వారి సమస్యలపై ఫోన్, వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా తనకు తెలియజేవచ్చని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌గా ఏ.తమీమ్ అన్సారియా బాధ్యతలు స్వీకరిస్తున్న సమయంలో ఆమె భర్త, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మన్జీర్ జిలానీ సమూన్, కుటుంబసభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లా అధికారుల శుభాకాంక్షలు

కలెక్టర్‌గా ఏ.తమీమ్ అన్సారియా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు జిల్లా అధికారులు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన అధికారులలో సిపిఒ డి.వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ టి.వసుంధర, జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర, ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల, జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.అర్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ మర్ధన్‌ఆలీ, మెప్మా పీడీ టి.రవికుమార్, హౌసింగ్ పీడీ ఈ.పేరయ్య, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ పివి రమణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపిచంద్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీరాణి, జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్, వికలాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, జిల్లా బిసి సంక్షేమాధికారి అంజల, ఎపిఆర్‌ఎస్‌ఎ ఒంగోలు కలెక్టరేట్ అధ్యక్షులు ఊతకోలు శ్రీనివాసరావు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఎపి దళిత ఉద్యోగుల సంఘం నాయకులు, వివిధ సెక్షన్ సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

4వ మహిళా కలెక్టర్

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా 38వ కలెక్టర్‌గా, 4వ మహిళా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో మహిళా కలెక్టర్లుగా బి.ఉదయలక్ష్మి, అనితా రాజేంద్ర, సుజాత శర్మ జిల్లా అభివృద్ధికి కృషి చేశారు.

మీరు తప్పుకోండి.. మా వాళ్లు వస్తారు!

(మొదటిపేజీ తరువాయి)

కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. కోవిడ్ కాలంలో 50 మంది కార్మికులను అప్పట్లో విధుల్లోకి తీసుకున్నారు. కోవిడ్ తరువాత కూడా వీరిని కొనసాగిస్తున్నారు. పెరిగిన నగర జనాభాకు అనుగునంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలనే డిమాండ్ ఉండటంతో వారిని కొనసాగిస్తున్నారు. అయితే గత ఏడాది కిందట మరో 100 మంది కార్మికులను కొత్తగా పారిశుధ్య పనుల్లోకి తీసుకున్నారు. వీరిని కోవిడ్ కార్మికుల జాబితాలోనే నమోదు చేశారు. వీరిలో 90 శాతం మంది వైసిపికి చెందిన పలువురు కార్పొరేటర్ల ద్వారా విధుల్లో చేరిన వారే కావడం విశేషం. 100 మంది కార్మికుల్లోనూ సగానికి సగం మంది మేస్త్రీల పని చేసేందుకు ఉద్యోగాలలో కుదిరారు. దీంతో కార్పొరేటర్ల ద్వారా విధుల్లో చేరిన కార్మికుల నియామకంలో డబ్బులు చేతులు మారాయనే విమర్శలున్నాయి. మొత్తంగా ఇప్పుడు కోవిడ్ కార్మికుల సంఖ్య 150కి చేరింది.

దీంతో కోవిడ్ కార్మికుల పేరుతో విధుల్లో చేరి మేస్త్రీలుగా చెలామణి అయ్యేవారితో పాటు మరికొంతమంది కార్మికులను కూడా తొలగించేందుకు కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోవిడ్ కార్మికుల జాబితాలో ఉన్న 150 మంది ఆప్కాస్‌లో లేరు. ఓ టెండర్ పిలిచి ఏజన్సీద్వారా వీరికి జీతాలు ఇస్తున్నారు. ఈ టెండర్‌ను బినామీలు దక్కించుకొని నడుపుతున్నారు. దీంతో బినామీ కాంట్రాక్టర్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని కాంట్రాక్టర్ ద్వారా కొంతమంది వర్కర్లను పక్కనపెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

కోవిడ్ కార్మికులకు మూడు నెలలకోసారి టెండర్ పిలుస్తున్నారు. మూడు నెలలకోసారి పిలిచే టెండర్ ఈ నెల 30 వరకే చెల్లుబాటులో ఉంది. దీంతో కొత్త టెండర్‌లో కొంతమంది పాత వారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని చేర్చుకోవాలనే దిశగా పలువురు టిడిపి నాయకులు పావులు కదుపుతున్నారని, ఇందుకు బినామీ కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో సహకరిస్తున్నాడని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ఏదిఏమైనా పారిశుధ్య విభాగం కేంద్రంగా జరుగుతున్న ఈ వ్యవహారం ఇప్పుడు కార్పొరేషన్ వర్గాలలో హాట్‌టాపిక్‌గా మారింది. అధికారికంగా ఎక్కడా ఒక్క కార్మికుడిని కూడా విధుల్లోకి రాకుండా ఎవ్వరూ ఆపలేదు. చాప కింద నీరులా ఈ తతంగం జరుగుతుండటం విశేషం. దీంతో జరుగుతున్న పరిణామాలపై మేయర్ గంగాడ సుజాత దృష్టి సారించారని తెలిసింది. పారిశుధ్య విభాగంలో తాజాగా నెలకొన్న పరిస్థితులపై ఆమె ఆరా తీస్తున్నారని తెలిసింది. డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, పలువురు అధికార పార్టీ కార్పొరేటర్లతో ఈ విషయంపై గురువారం ఆమె తన ఛాంబర్‌లో చర్చించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

ప్రతి విద్యార్థికీ పుస్తకమే మంచి స్నేహితుడు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రతి విద్యార్థికి పుస్తకమే మంచి స్నేహితుడు అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని మల్లికార్జునపురం ఏపి రెసిడెన్షియల్ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలోనే నాణ్యమైన విద్యను అందించామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ విద్య కుంటుపడిందని తెలిపారు. తిరిగి కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో మంత్రి లోకేష్ సారథ్యంలో అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో వంద శాతం అడ్మిషన్లు పూర్తి చేసి విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. అవసరమైన పాఠశాల భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఎరిక్షన్‌బాబు విద్యార్థి దశకు సంబంధించిన పలు సంఘటనలు గుర్తుకు తెచ్చుకొని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి మస్తాన్‌నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, అంబటి వీరారెడ్డి, బాషా, దొడ్డా శేషాద్రి, చంటి, జనసేన మండల కన్వీనర్ మురళి తదితరులు పాల్గొన్నారు.



దోర్నాలలో బ్యాగులు పంపిణీ చేస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం మండలం బోయలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోయలపల్లి గ్రామ సర్పంచ్ పాలడుగు వెంకట కోటయ్య మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. విద్య కోసం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమ్లా నాయక్, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యా కిట్లు పంపిణీ

మార్కాపురం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి, మాజీ జెడ్పిటిసి, ప్రముఖ వ్యాపార వేత్త.. మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సోదరుడు కందుల రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ఇదే పాఠశాలలో తాను కూడా చదువుకున్నానని, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో అధునాతన సౌకర్యాలతో విద్యా బోధన జరుగుతోందని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాల అందించే సేవలను వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న స్టూడెంట్ కిట్‌ను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేష్

జిల్లా నూతన కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన తమిమ్ అన్సరియాను మాజీ మంత్రి, వైసిపి కొండపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు చెప్పారు. అదే విధంగా జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌ను కూడా ఆయన కార్యాలయానికి వెళ్లి కలిశారు.

చెన్నరాయునిపల్లిలో బడిబాట

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సార్డ్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం మండలంలోని చెన్నరాయునిపల్లి గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మరియబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని కోరారు. అప్పుడే ఈ కార్యక్రమం విజయవంత మవుతుందన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థుల కోసం అమలవుతున్న పథకాలు, సౌకర్యాల గురించి వివరించాలన్నారు. ఎవరైనా బడి బయట ఉన్న పిల్లలను బడికి పంపించి చదివించాలని కోరారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, గిరిజన గ్రామాలలోనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ డ్రాప్ అవుట్ లేకుండా చూడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్య గొప్పతనాన్ని, విద్య ఆవశ్యకతను తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మందా సుధాకర్, సార్డ్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పెళ్లికుమారుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న బూచేపల్లి

వివాహ వేడుకల్లో దర్శి ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కురిచేడు

గురువారం స్థానిక వాణి కళ్యాణ మండపంలో కురిచేడుకు చెందిన పెద్ద ఖాసీం కుమార్తె అమ్రినుకు, మార్కాపురానికి చెందిన షేక్ ముత్తుజావలి కుమారుడు షేక్ నబీరసూల్‌కు వివాహం జరిగింది. ఈ వివాహానికి ముఖ్యఅతిథిగా దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కురిచేడు జడ్పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి, కురిచేడు సర్పంచ్ కేసనపల్లి కిష్టయ్య, నాయకులు మీరువ సుబ్బారెడ్డి, మెరువ పిచ్చిరెడ్డి, డాక్టర్ ఎస్ఎం బాషా, నుసుం ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయంశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

స్వయం శక్తితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. జనని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుటుంబ శిక్షణ పొందిన 100 మంది మహిళలకు మాజీ కౌన్సిలర్ బొగరపు శ్రీలత సద్గురు సహకారంతో కుట్టుమిషన్లను గురువారం స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఆయన పంపిణీ చేశారు. మహిళల అభ్యున్నతి కోసం ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించిన మాజీ కౌన్సిలర్ బొగ్గరపు శ్రీలత సద్గురులను ఆయన అభినందించారు. కుట్టే శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్‌లతో పాటు సర్టిఫికెట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు పాల్గొన్నారు.



కుట్టుమిషన్, సర్టిఫికెట్ అందజేస్తున్న ఉగ్ర

ఆదర్శ పాఠశాల అభివృద్ధికి కృషి

కనిగిరి ఆదర్శ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యేగా డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఎన్నికైన వెంటనే తొలి ప్రాధాన్యతగా ఆదర్శ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టిన విషయం విదితమే. పాఠశాల ప్రిన్సిపల్ వివి రమణయ్య, ఎస్ఎంసి చైర్మన్ గోపిశెట్టి బాల చెన్నారావు, అధ్యాపకులు గురువారం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల లేని కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి వారు తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని, మౌలిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యువల్ ప్రొసీడింగ్ ఇవ్వని కారణంగా వేతనాలు అందే పరిస్థితి లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సంబంధిత శాఖ జెడి దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి ఆదర్శ పాఠశాలల కాంట్రాక్టు అధ్యాపకుల రెన్యువల్ ప్రొసీడింగ్స్ ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలను సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని, విద్యార్థుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు.

శాస్త్రవేత్త రాజేష్‌చౌదరికి సత్కారం

ప్రజాశక్తి-దర్శి

గుంటూరు లాంకు బదిలీపై వెళ్తున్న కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎల్ రాజేష్‌చౌదరిని దర్శి వ్యవసాయ పరిశోధన స్థానం సిబ్బంది ఘనంగా సత్కరించారు. వివరాలలోకి వెళితే.. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దర్శి వ్యవసాయ పరిశోధన స్థానంలో ఎంటమాలజిస్ట్ (కీటక శాస్త్రవేత్త)గా పని చేస్తున్న డాక్టర్ ఎల్ రాజేష్ చౌదరి గుంటూరు లాంకు బదిలీ అయిన సందర్భంగా స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ పి సంధ్యారాణి మాట్లాడుతూ రాజేష్ చౌదరి రైతులు ఏ సమయంలో ఫోన్ చేసినా వెంటనే స్పందించి పంటలపై సూచనలు, సలహాలు ఇచ్చే వారని అన్నారు. మరొక శాస్త్రవేత్త సిహెచ్ వరప్రసాద్ మాట్లాడుతూ తాను పంట పొలాలు గురించి అడిగినప్పుడు వెంటనే స్పందిస్తారని, రాజేష్ చౌదరి ఇక్కడి నుంచి బదిలీ కావడం బాధాకరమని అన్నారు. సన్మాన గ్రహీత రాజేష్ చౌదరి మాట్లాడుతూ ఇక్కడ వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న సిబ్బంది, టైం స్కేల్ ఉద్యోగులు, పాలిటెక్నిక్ సిబ్బంది, కెవికె సిబ్బంది తనపై ఎంతో ఆదరాభిమానాలు చూపించారని అన్నారు. అనంతరం వ్యవసాయ పరిశోధనా స్థానం సిబ్బంది, టైం స్కేల్ ఉద్యోగులు, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ సిబ్బంది, కెవికె సిబ్బంది రాజేష్ చౌదరిని శాలువాలు కప్పి, పూలదండలు వేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టైం స్కేల్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు, గిరి నాగ హరీష్, మౌనిక, రితిక, సుష్మిత, హరిత, ఏడుకొండల రాజు, భగత్, వెంకటేష్ ప్రసంగించారు.



శాస్త్రవేత్తను సత్కరిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని భవాని సెంటర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందగా, ఒక బాలునికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం వేకువజామున జరిగింది. పట్టణంలోని గుర్రాల కాలనీకి చెందిన తండ్రీ కొడుకులు ద్విచక్ర వాహనంపై బల్లికురవ మండలం కొప్పెరపాడు గ్రామానికి ప్రయాణిస్తున్న సమయంలో ఒక్కసారిగా గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో గజ్జల సుబ్బారావు(40) వాహనం టైర్ కిందపడి నుజ్జునుజ్జయ్యాడు. మృతుని కుమారుడు కార్తీక్‌కు కాలు నుజ్జు నుజ్జయింది. స్థానికులు వెంటనే బాలుడుని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వం వైద్యశాలకు పోలీసులు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం శానంపూడి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గుండెపోటుతో గురువారం నాడు మృతి చెందారు. తంగేళ్ల వెంకట సుబ్రహ్మణ్యం(56) అనే ఉపాధ్యాయుడికి గత రెండు రోజుల క్రితం ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఒంగోలులోని ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ గుండెపోటు వచ్చిందని చెప్పడంతో దానికి సంబంధించి చికిత్స చేస్తుండగా గురువారం మృతి చెందారు. మూలగుంటపాడులోని ఆయన నివాసం వద్ద ఉన్న మృతదేహానికి మండల విద్యాశాఖ అధికారి బి శివ నారాయణ నివాళులర్పించారు. వీరి వెంట ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ కె శ్రీహరి తదితరులు నివాళులర్పించారు.

తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి ఎనిమిది గేదెలు మృతి

సుమారు రూ.7 లక్షలకు పైగా ఆస్తి నష్టం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మేత కోసం పొలాలకు వెళ్లిన 8 గేదెలు గాలులకు తెగి కిందపడిన విద్యుత్ మెయిన్ లైన్ తీగలు తగిలి మత్యువాత పడ్డారు. సంఘటన మండలంలోని సిద్ధవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కొనకనమిట్ల మండలంలోని సిద్ధవరం, పొదిలి మండలంలోని మూలశంకల గ్రామాలకు చెందిన ఎనిమిది గేదలు గురువారం మేత కోసం పొలాలకు వెళ్లాయి. అప్పటికే పొలంలో విద్యుత్ మెయిన్ తీగలు తెగి కింద పడి ఉన్నాయని, విద్యుత్ సరఫరా ఉన్న తీగలను తగిలిన ఎనిమిది గేదెలు అక్కడికక్కడే మత్యువాత పడ్డాయని గేదెల యజమానులు తెలిపారు. సిరుగురి అచ్చయ్యది ఒకటి, సిరుగురి మార్కు ఒకటి, బండారు శ్రీను ఒకటి, వెంకట్రామయ్య ఒకటి, వెంకటేశ్వర్లుకు చెందినవి రెండు, గుమ్మల ఆదేయ్య ఒకటి, బండారు బుల్లేయ ఒకటి వెరసి 8 గేదెలు మత్యువాత పడ్డాయని వారు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.7 లక్షల పైగా ఉంటుందని భాదిత యజమానులు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ తీగలను తొలగించటం జరిగిందన్నారు. గేదెలే మా కుటుంబాలకు జీవనాధారం అని ఆ విషయం పోవటం వల్ల మా కుటుంబాలు వీదిన పడతాయని వారు వాపోయారు. ప్రభుత్వ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించి మా కుటుంబాలను ఆదుకోవాలని బాధితులు అభ్యర్థిస్తున్నారు.

అమృత కాలేజీ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-శింగరాయకొండ

జూనియర్ ఇంటర్ బెటర్మెంట్ ఫలితాలలో శింగరాయకొండ అమృత జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి కరస్పాండెంట్ కేశవరపు వెంకట శేషమ్మ మరియు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అభినందనలు తెలియజేశారు.

సిఐటియు ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - బాపట్ల

రక్తదానంతో అనేక మందిని ప్రాణాపాయం నుండి కాపాడవచ్చని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా మజుందార్ మాట్లాడుతూ రక్త దానం ప్రాణదానంతో సమానమని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని అన్నారు. సిఐటియు కార్మిక వర్గ సమస్యలపై పోరాటంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తుందని అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు సిఐటియు ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి ఆపదలో ఉన్నవారికి రక్తం దానం చేసే అంశాలపై సిఐటియు విస్తృతంగా ప్రచారం చేసి అందులో భాగంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం తోపాటు సామాజిక సేవలు అందిండంలోనూ ముందుంటుందని అన్నారు. యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. అనేక మంది సిఐటియు కార్యకర్తలు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యులు సిబ్బంది రక్తాన్ని సేకరించి ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు తరలించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె శరత్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఓలక్ష్మణ్, జె శామ్యూల్, రాజారావు, చిన్ని, మురళి, ఐద్వా నాయకులు టి సుభాషిణి పాల్గొన్నారు.



ప్రజా సంఘాల కార్యాలయంలో రక్తదాన శిబిరం

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

గత ఏడాది వరదలకు పంట నష్టపోయిన రైతులందరికి నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం డివిజన్ నాయకులు కందిమల్ల రామ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కొణిదెల వీరాస్వామి సామ్రాజ్యం భవనంలో రైతు సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. గత ఏడాది పంట నష్టపరిహారం ఇప్పటికీ చెల్లించలేదని అన్నారు. అక్కడక్కడ కొద్ది మందికి మాత్రమే గత ప్రభుత్వం చెల్లించిందని, నష్టపోయిన సన్నా చిన్నకారు రైతులతోపాటు కౌలు రైతులకు గత ఏడాది దెబ్బతిన్న పంటల నష్టపరిహారం అందేలా చర్యలకు ప్రస్తుతకొత్త ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లగా రైతులు మిరపతోపాటు శనగ పంట వేసి నష్టపోయారని పేర్కొన్నారు. అనుకోకుండా ఈ ఏడాది పొగాకు సాగు చేసిన కొద్ది మందికి మాత్రమే పొగాకు ధర ఆశాజనకంగా ఉండటంతో లబ్ధి పొందారని అన్నారు. గత రెండేళ్లగా నాగార్జునసాగర్‌తో పాటు వివిధ డ్యాముల్లో సక్రమంగా నీరు లేకపోవటంతో మాగాణి సాగు చేయలేక చాలామంది రైతులు నష్టపోయారని అన్నారు. మాగాణి సాగుకు మాత్రమే పనికి వచ్చే పొలాలు రెండేళ్లగా నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వాలకు, రాజకీయాలకు అతీతంగా రైతు సంఘం నిరంతరం పోరాటం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. సమస్యలపై పోరాటం చేయకుంటే ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవని అన్నారు. ఎప్పటికప్పుడు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతూ పరిష్కరించకపోతే పోరాటం చేయటానికి రైతు సంఘం సిద్ధంగా ఉందని అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడం హర్షించదగ్గ విషయమే అన్నారు. అయితే రైతులకు నష్టం చేసే బిజెపి చేపట్టిన నల్ల చట్టాలను రద్దు చేసేందుకు ప్రభుత్వం ఎన్డీఎ తరపున కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని నష్టాల్లోకి నెట్టి రైతులకు భూములు దూరం చేసేదెందుకు ప్రణాళిక సిద్ధం చేసి తద్వారా ఈ భూములన్ని ధనవంతులకు కట్టబట్టేందుకు చర్యలు అంతర్గతంగా జరుగు తునున్నాయని ఆరోపించారు. రైతు సమస్యలపై చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, నకిలీ ఎరువులను అరికట్టటానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు రైతులకు అమలయ్యే రాయితీలన్నీ వారికి అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు పంగులూరి హనుమయ్య, పంగులూరి హరిబాబు, కరి వెంకన్న, ముప్పరాజు శ్రీనివాసరావు, మురకొండ సింగయ్య, మాదాల అంజయ్య, నార్నె సింగయ్య, కొల్లూరి హనుమంతురావు, ఎనిగళ్ల వెంకటేశ్వర్లు, ఇంటూరి సుబ్బారావు పాల్గొన్నారు.


ఇంకొల్లు రైతు సంఘం సమావేశంలో రైతు నాయకులు

కౌలు రైతు గుర్తింపు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

అర్హులైన కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకొని వాటి ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి పొందాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం రుణాలు, సబ్సిడీ పథకాలు అందజేస్తుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న పలువురు రైతులకు కౌలు రైతు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. మండలంలో 5700 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసే లక్ష్యంగా పెట్టారని, అర్హులైన ప్రతి ఒక్కరు తమ గ్రామ రైతు భరోసా కేంద్రాలు, వీఆర్వో కార్యాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి టి బాలాజీ గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్, తహశీల్దారు బ్రహ్మయ్య పాల్గొన్నారు.


కౌలు రైతు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిసపాడు మండలంలోని అనుమలమూరు, ఎర్రబాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు గురువారం పరిశీలించారు. పేదలకు ఈ చట్టం వరం లాంటిదని అన్నారు. కాబట్టి ప్రభుత్వం నుండి కూలీలకు వచ్చే ప్రయోజనాలన్నింటినీ తీసుకుంటూ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పై ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసి, రద్దు చేయాలని కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ప్రతి కూలి మన సొంత పనిలా భావించి పనిచేస్తూ చట్టాన్ని మంచి మార్గంలో నడిపించుకోవాలని సూచించారు. కూలీలకు రావలసిన మజ్జిగ, పార, గడ్డపార, టెంటు బిల్లులకు సంబంధించిన అంశాన్ని ఆయన గుర్తు చేశారు. కూలీలు, మేట్లు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎం ఆంజనేయులు


పిహెచ్‌సిలో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు

పీహెచ్‌సీని సందర్శించిన టాస్క్ ఫోర్స్

ప్రజాశక్తి - రేపల్లె


మండలంలోని మోళ్లగుంట, పోటుమేరక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు ఎస్ఓ వేణు, మేనేజర్ లక్ష్మణ గురువారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలు, రికార్డులు పరిశీలించారు. రోజు ఎంత మందికి ఓపీ చూస్తున్నారని తెలుసుకున్నారు. ఇన్ పేషెంట్ల సంఖ్య, పేషెంట్లకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. శానిటేషన్, వాటర్, మరుగుదొడ్లు, జాతీయ కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నారని, సమయపాలన పాటిస్తున్నారాని ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు. వైద్య సేవలు అందించడంలో కాని, వైద్యశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంలో కాని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ, పట్టణ ప్రజలు నమ్మకంతో వైద్యశాలకు వచ్చే విధంగా సేవలు అందించాలని సూచించారు. అక్రమాలు, అవినీతికి పాల్పడితే సహించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి, వైవి రావు, సూపర్వైజర్లు రంగారావు, ప్రేమ కుమారి, ఎఎన్ఎం కిరణహ్మాయి, విజయలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.


చిరుధాన్యాలు ప్రదర్శిస్తున్న వ్యవసాయ అధికారులు

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని వరాహపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. బాపట్ల ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ బాల మురళీధర్ నాయక్ రైతులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. చిరుధాన్యాలు మనిషి ఆహార అలవాటులో భాగస్వామ్యం చేసుకోవాల్సి ఉందన్నారు. శాస్త్రవేత్తలు జె రాధాకృష్ణ, ఎం ఉషారాణి రైతులకు చిరుధాన్యాల సాగులో వినియోగించాల్సిన ఎరువులు, పురుగు మందులపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. వాటిని ప్రతి ఒక్కరు గుర్తించి సాగు చేయడమే కాక వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి డిఆర్సి, డిటిసి, డిఏలు, విజయ నిర్మల పాల్గొని రైతులకు చిరుధాన్యాల సాగుపై మెలుకువలు వివరించారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్ సునీత, సర్పంచి ఎల్లమాటి స్వాతి, విఎఎ దీప్తి, రైతులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆటో నాయకులు

ఆటో స్టాండ్ బోర్డుల కోసం వినతి

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు ప్రయాణికులను చేర్చే ఆటోలు నిలుపు కునేందుకు పట్టణంలో ఆటో పాయింట్లకు బోర్డుల సౌకర్యం కల్పించాలని కార్మిక శక్తి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు గొలపల పూర్ణచంద్రరావు కోరారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పట్టణ పోలీసులకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని నర్సాయపాలెం, జమ్ములపాలెం, జిల్లెళ్ళమూడి, కంకట పాలెం, చెరుకూరు, దేవినూతల, పిన్నిబోయిన వారిపాలెం గ్రామాలకు గత 20ఏళ్లుగా పట్టణం నుండి ప్రయాణికులను చేరవేస్తూ అనేక మంది ఆటో కార్మికులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. గతంలో ఆయా గ్రామాల ఆటో పాయింట్ల తోపాటు బోర్డులు ఏర్పాటు చేసుకునే విధంగా పోలీసులు అనుమతిచ్చారని గుర్తు చేశారు. అయితే రహదారుల విస్తరణలో భాగంగా ఆటో పాయింట్ బోర్డులను తొలగించారని తెలిపారు. దీంతో ఆటోలు ఎక్కడ నిలుపుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు సైతం ఆయా గ్రామాలకు వెళ్లాలంటే వెతుక్కునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గ్రామాల వారీగా ఆయా ప్రాంతాలకు వెళ్లే ఆటో పాయింట్ల బోర్డులను తిరిగి ఏర్పాటు చేసుకునే విధంగా అనుమతి ఇవ్వాలని కోరారు. రహదారి విస్తరణ జరిగిన నేపథ్యంలో ఆటో పాయింట్ బోర్డులు ఏర్పాటు చేసుకునేందుకు కొంతమంది వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. వ్యాపారులతో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఆటో స్టాండులు, ఆటో పాయింట్ బోర్డులను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె కోటేశ్వరరావు, మార్పు తిరుపతయ్య, ఎం గోపి, ఎస్కె మౌలాలి, కె సీయోను, జి జాన్, పి ఆదాం, షేక్ మహబూబ్ బాషా, ఖాజావలి పాల్గొన్నారు.

కనిగిరిని అభివృద్ధి చేసుకుందాం: ఉగ్ర

కనిగిరి మున్సిపాలిటీ ఎక్స్అఫిషియో మెంబర్గా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కనిగిరి

వెనుకబడిన కనిగిరిని ఐక్యంగా అభివృద్ధి చేసుకుందామని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలియజేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్గా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను సాదరంగా ఆహ్వానించి కౌన్సిలర్లను పరిచయం చేశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రస్తుత కమిటీ ఐక్యంగా కృషి చేసిందని కొన్ని పనులు పెండింగ్లో ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు సహకారం అందించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తనకు పదవులపై కాంక్ష లేదని, తాను పుట్టిన వెనుకబడిన కనిగిరి ప్రాంతాన్ని ఎలాగైనా అభివృద్ధి చేయాలనే కాంక్షతో ఎన్నికల్లో పోటీ చేసినట్లు తెలిపారు. కనిగిరి నియోజకవర్గం నుంచి సుమారు 65,000 మంది ఇతర ప్రాంతాలకు వలసపోయినట్లు గుర్తించామని, అది చాలా బాధ వేసిందని తెలిపారు. గత పాలకులు 10 సంవత్సరాలుగా అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరమన్నారు. తన దృష్టి అంతా వెనుకబడిన కనిగిరిని అభివద్ధి చేయడం పైనే ఉంటుందన్నారు. కనిగిరి ఆదర్శ పాఠశాల విద్యార్థులు 10 సంవత్సరాలుగా పడుతున్న అవస్థలు తీర్చేందుకు ముందుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నడికుడి, శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు వేగవంతంగా సాగేలా కృషి చేస్తున్నానని తెలిపారు. వచ్చే ఏడాదికి ట్రిబుల్ ఐటీ క్లాసులు కనిగిరిలో జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షిత జలాలను అందిస్తామని అన్నారు. ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేయడంతో పాటు ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపిస్తామని, అందుకు వారు సహకరించాలని కోరారు. రాష్ట్ర మంత్రివర్గంతో తమకున్న పరిచయాలతో కనిగిరి ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించేందుకు ఉపాధి కల్పించి వలసలు నివారించేందుకు పాటుపడతానని తెలిపారు. నిమ్జ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. భూగర్భ జలాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. కీర్తిశేషులు మాజీ కేంద్రమంత్రి పులి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు కనిగిరి ప్రాంతానికి మంచి చేసినవారిగా ప్రజల మనసులో నిలిచారని అన్నారు. విద్యావ్యవస్థ అభ్యున్నతికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, మాణిక్యరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మున్సిపాలిటీ ఎక్స్ ఆఫ్షియో మెంబర్గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి


నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేస్తున్న పూనాటి వెంకటరావు

మండలంలోని పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టిడిపి సీనియర్ నాయకులు పూనాటి వెంకటరావు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ఎస్కె శిలార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కొల్లా శివాజీ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పనలో పూనాటి వెంకటరావు చేస్తున్న కృషిని అభినందించారు. నోటు పుస్తకాలు, పలకలు విద్యా సామగ్రి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాత పూనాటి వెంకటరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. చదువే అన్నింటికీ మూలమనీ, చదువు ఎడల శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, బలపాలు, చాక్పీసులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూనాటి వెంకటరావును ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి నాయుడుపాలెం మాజీ ఉప సర్పంచ్ ఇస్తర్ల ఏడుకొండలు, ఉపాధ్యాయులు ఎస్వి సంజీవి, వాకా కవిత, నాయకులు ధర్నాసి చందు, కూడల చినశ్రీనివాసరావు, వీరాంజనేయులు, వెంకటరావు, సొంగా యాదగిరి పాల్గొన్నారు.

దళిత విద్యార్థులకు అండగా మంత్రి స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో దళితుల విషయంలో మాట్లాడే అర్హత వైసిపికి లేదని, వారిని మోసం చేయడంలో మాత్రం ఆ పార్టీ మొదటి స్థానంలో ఉందని శింగరాయకొండ టిడిపి మండల ఎస్సీ సెల్ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం నాడు శింగరాయకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇక్కడ ఓటమిపాలైన వైసీపీ మాజీ మంత్రి ఆదిమూలపు సురేషకు ఇప్పుడు దళితులు గుర్తొచ్చారా అని ప్రశ్నించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విదేశీ విద్యను తొలగించి జగనన్న విదేశీ విద్య అని పేరు పెడితే అప్పుడు నిద్రపోయాడా అన్నారు. విద్యా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆదిమూలపు సురేష్ శింగరాయకొండ గురుకుల పాఠశాలలో సైన్స్ గ్రూపులను ఎత్తేసినప్పుడు దళిత విద్యార్థులు గుర్తు రాలేదా అన్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తొలి సంతకం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంచి భోజనంతో పాటు సైన్సు గ్రూపులను ఏర్పాటు చేయాలని సంతకం పెట్టారని అన్నారు. ఇది దళితులకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఇచ్చే మంచి గౌరవమని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులను మోసం చేసి ప్రభుత్వం పోయి 11 సీట్లకే పరిమితమైన వైసీపీ నాయకులకు ఇప్పుడు దళితుల గురించి మాట్లాడే అర్హత లేదని వారు ధ్వజమెత్తారు. ఈ విలేఖరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు సుదర్శి ప్రసాదరావు, పొనుగోటి కొండయ్య, గర్నెపూడి సుబ్రహ్మణ్యం, నూతలపాటి చైతన్య, బొడ్డు బాలకోటయ్య, ఎస్టీ సెల్ నాయకులు పోట్లూరి లక్ష్మయ్య, అంబటి కోటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

'ఎస్వికెపి కళాశాల'లో..

విద్యార్థులను చేర్చుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని ఎస్వికెపి ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలో 2024-25 సంవత్సరానికి ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకునే విద్యార్థులను చేర్చుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ ఏడాదిలో ఇంటర్లో, డిగ్రీలో చదువుకోవాలని ఆసక్తి కలిగిన విద్యార్థుల ప్రవేశానికి యాజమాన్యం అడ్డుతగలడాన్ని ఎస్ఎఫ్ఐ ఖండించింది. ప్రవేశాలను అడ్డుకుంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి విజయ్ మాట్లాడుతూ 1964 నుంచి మార్కాపురంలో ఎస్వికెపి ఎయిడెడ్ కళాశాలగా కొనసాగుతోందని అన్నారు. అప్పటి నుంచి నేటి వరకు యుజిసి, ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో ఈ కళాశాలలో మౌలిక సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బందిని ఏర్పాటు చేశారన్నారు. ఈ కళాశాలలో నేటికీ పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. మార్కాపురం పట్టణంలోని విద్యార్థులతో పాటు మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కొనకనమిట్ల మండలాల నుంచి పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఈ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులలో చేరి ప్రభుత్వం నిర్ణయించిన అతి తక్కువ ఫీజులతో చదువుకునేవారన్నారు. ఎయిడెడ్ కోర్సులలో 2019-20 విద్యా సంవత్సరం వరకు మాత్రమే విద్యార్థులను చేర్చుకున్నారని అన్నారు. ఆ తర్వాత కాలం నుంచి కళాశాల యాజమాన్యం, సిబ్బంది పేద బడుగు బలహీన వర్గాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అడ్మిషన్లను నిరాకరిస్తున్నారని ఆరోపించారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు కళాశాలలో సంప్రదించగా తమ కళాశాలలో అడ్మిషన్లు లేవని వెనక్కి పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రైవేటు కళాశాలలో చేరమని ఉచిత సలహా ఇచ్చి పంపడం పరిపాటిగా మారిందన్నారు. దీంతో విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులను చెల్లించే స్థోమత లేకపోవడంతో చదువులు మధ్యలో ఆపేస్తున్నారన్నారు. ఎన్నో లక్ష్యాలతో ఏర్పాటైన ఈ ప్రభుత్వ ఎయిడెడ్ ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో గత రెండు సంవత్సరాల నుంచి విద్యార్థులు లేకున్నా ఎయిడెడ్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి (పర్మినెంట్ సిబ్బంది) విద్యార్థులను చేర్చుకుందామనే ఆలోచన లేకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచి ఎస్వికెపి ఎయిడెడ్ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులలో విద్యార్థులను చేర్చుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతనంగా ప్రభుత్వ ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలను ప్రారంభించి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అడ్మిషన్లు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందించారు.



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు


నూతనంగా ఎన్నికైన విఆర్ఎ కొమరోలు మండల కమిటీ

విఆర్ఎల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలో వీఆర్ఎల నూతన కమిటీని వీఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన ఎన్నుకున్నారు. అదేవిధంగా వీఆర్ఏల సమస్యల గురించి జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో చర్చించుకున్నారు. అదేవిధంగా కొమరోలు మండలంలో మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా పుట్ట వీరాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షులుగా జాజం రాజేశ్వరి, సయ్యద్ హబీబా, సెక్రెటరీగా అంచల విజయబాబు, ట్రెజరర్గా బందెల ఆంతోని, భోగరాజు భారతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడు పుట్ట వీరాంజనేయులు మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా కమిటీ దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.


ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

నీటి కోసం మహిళల ఆందోళన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

నీటి కోసం మహిళలు గురువారం ఆందోళన బాట చేపట్టారు. పెద్దదోర్నాల పట్టణంలోని వడ్డెర కాలనీ, పీర్ల చావిడి వీధి, ఐనముక్కలలోని దాసరి కాలనీలతో పాటు పలు వీధులకు చెందిన మహిళలు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వారంతా పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ప్రభుత్వ కాంట్రాక్టర్లు ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలడం నిలిపివేశారు. పూర్తి స్థాయిలో టిడిపి కాంట్రాక్టర్లు ఇంకా నీళ్లు తోలడం ప్రారంభించలేదు. దీంతో నీటి సమస్య ఉత్పన్నమైంది. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మోహన్రావు మహిళలకు సర్ది చెప్పారు. వారం రోజుల్లో సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని తెలిపారు. దీంతో మహిళలు ఆందోళనను నిలిపివేశారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-గిద్దలూరు

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కమాండ్ కంట్రోల్ రూమ్కు ఫిర్యాదు చేయాలనుకునేవారు 9491229135 నెంబరులో సంప్రదించాలని కోరారు. పట్టణ ప్రజలు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు తదితర సమస్యల పరిష్కారం కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ను సంప్రదించవచ్చని, తద్వారా సమస్యలు త్వరగా పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పిసిపల్లి

విద్యార్థులకు నోటు పుస్తకాలను దాతల సహాయంతో ఉచితంగా పంపిణీ చేసినట్లు స్థానిక ఎంఈఓ ఆర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని గుంటూరు లింగన్నపాలెం యూపీ స్కూల్లో చదువుతున్న 80 మంది విద్యార్థులకు ఉచితంగా ఒక్కొక్కరికి నాలుగు నోటు పుస్తకాలు చొప్పున పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. పెదఇర్లపాడుకు చెందిన మాదాసు రమేష్, నేరేడుపల్లికి చెందిన సిద్దే మహేందర్రెడ్డి ఆర్థిక సహకారంతో నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఎంఇఓ 1జి సంజీవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవరావు, ఉపాధ్యాయులు సిహెచ్ రమేష్, ప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.



ఎంపీడీఓలతో ఎంఎల్ఎ ఆనందబాబు సమీక్ష

పెన్షన్ ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలి

సమీక్ష సమావేశంలో ఎంఎల్ఎ ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, వితంతు పెన్షన్లను ఏప్రిల్ నెల నుండే రూ.4వేలకు పెంచి గడిచిన 3నెలలకు సంబంధించిన రూ.3వేలతో ఈనెల రూ.4వేలు కలిపి రూ.7వేల పెన్షన్ను జూలై 1న అందజేస్తున్నట్లు శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు చెప్పారు. ఎంపీడీఓలతో తన క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్ 1న ఉదయం 6 గంటలకే పెన్షన్ ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బందిని వినియోగించుకొని 1, 2వతేదీల్లోనే పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. జాప్యం కాకుండా ఎంపిడిఓలు పంపిణీ పర్యవేక్షించాలని చెప్పారు.



పంగులూరు మండలం ఏపీటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. నూజిలపల్లి, చందలూరు, తూర్పు కొప్పెరపాడు, తూర్పు తక్కెళ్ళపాడు, అలవలపాడు, రేణింగవరం, జాగర్లమూడి వారి పాలెం, ముప్పవరం గ్రామాల్లోని పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రతినిధులు కంకణాల శ్రీనివాసరావు, చేజర్ల చెంచు రామారావు, ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తన్నీరు వెంకట్రావు, రాహంతుల్లా నరసింహవారి పాల్గొన్నారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ఎబి పాలెంలో పట్టపగలే చోరీ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అన్నంబొట్ల వారిపాలెంలో పట్టపగలు చోరి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మర్రి జానకి అమెరికాలో తన కుమారుడి వద్దకు వెళ్ళింది. ఈనెల 9న అమెరికా వెళుతూ ప్రతి రోజు ఇల్లు శుభ్రం చేసేందుకు పనిమనిషికి తాళాలు ఇచ్చి వెళ్లారు. రోజు లాగానే ఇల్లు శుభ్రం చేయటానికి వచ్చిన పనిమనిషి ఇంటి తలుపులు తీసి ఉండటం చూసి ఆశ్చర్య పోయి, లోనికి వెళ్లి చూస్తే బీరువా తీసి ఉండటాన్ని గమనించి లబోదిబోమన్నారు. వెంటనే బయటికి వచ్చి ఇరుగు పొరుగు వారిని పిలిచి విషయం చెప్పింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. అమెరికాలో ఉన్న మర్రి జానకికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. 2సవర్ల బంగారు ఆభరణాలు, 3కిలోల వెండి వస్తువులు, రూ.20వేల నగదు పోయినట్లు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి

చెరువును తలపిస్తున్న ఐలవరం రహదారి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఐదేళ్ళుగా అభివృద్ధికి నోచుకోక పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి వర్షాల సమయంలో చెరువులను తలపిస్తున్నాయి. గత పదేళ్లుగా ఈ రహదారి అధ్వాన స్థితికి చేరుకోవడంతో ఆనాటి తెలుగుదేశం పాలనలో వేమూరు ఎంఎల్ఎ, మాజీ మంత్రి నక్కా ఆనందబాబును ఈ రహదారిని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరడంతో ఎట్టకేలకు గతంలో టిడిపి పాలన ముగిసే సమయంలో గ్రామం నుండి జాతీయ రహదారి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.90లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో పనిని ప్రారంభించి ఇరువైపులా కీ వాల్ నిర్మాణం చేపట్టి మధ్యలో డస్టు నింపారు. అంతటితో ఎన్నికలు సమీపించడంతో రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టింది. వైసీపీ పాలనలో శాసనసభ్యులు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన మేరుగు నాగర్జున ఎప్పటికప్పుడు రహదారిని అభివృద్ధి చేస్తానని ప్రజలకు చెప్పుకుంటూ ఎలాంటి అభివృద్ధి లేకుండా గాలికి వదిలేశారు. ఎన్నికల సమయానికి ముందు నియోజకవర్గం



చెరువులను తలపిస్తున్న ఐలవరం రహదారి

వదిలి వెళ్ళిపోయారు. గత టిడిపి పాలనలో ఏర్పాటు చేసిన కీ వాల్ మధ్య డస్ట్ వర్షాలకు, వాహనాల రాకపోకలకు పక్కకు జరిగి పెద్ద పెద్ద గుంటలు ఏర్పడ్డాయి. గత ఐదు ఏళ్లుగా గ్రామస్తులంతా ఈ గుంటల్లోనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది.

పాలకులు మారారు కానీ రోడ్డు మారలేదు

గతంలో తారు రోడ్డుగా ఉన్న ఈ రహదారి అధ్వాన స్థితికి చేరడంతో గతంలో తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో గాని, వైసిపి పాలనలో గాని ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన రహదారి దెబ్బతినగా ఆ తర్వాత అధికారానికి వచ్చిన టిడిపి, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో రహదారి దుస్థితికి చేరింది. గ్రామం నుండి జాతీయ రహదారి 216వరకు గుంటలు ఏర్పడి గ్రామంలోకి ప్రయాణించాలంటే ఇబ్బందికరంగా మారిందని గ్రామస్థులు రగిలిపోతున్నారు. నిత్యం గ్రామం నుండి వివిధ రకాల పనులపై గ్రామ నుండి బయటికి వెళ్లే ప్రజలకు ప్రతిరోజు నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు. వర్షాలు సమయంలో ఎక్కడ గట్టు ఉంటుందో, ఎక్కడ గుంట ఉంటుందో తెలియని దుస్థితిలో ప్రయాణికులు గుంటల్లో పడి గాయాలపావుతున్న సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యంలో తెలుగుదేశం నిర్మాణాలపై దృష్టి సారిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మరో మారు గెలుపొందిన నక్కా ఆనందబాబు ఈసారైనా ఐలవరం రహదారి పట్ల శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

చేతుల శుభ్రతపై చిన్నారులకు శిక్షణ



చేతుల పరిశుబ్రతపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పంగులూరు

సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ ముప్పవరం సెక్టార్ సూపర్వైజర్ పద్మజ అన్నారు. డయేరియా నిర్మూలనలో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులకు చేతుల పరిశుబ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. భోజనం చేసే ముందు, చేసిన తర్వాత కూడా చేతులను శుభ్రంగా కడుక్కోవాలని అన్నారు. సూక్ష్మజీవులను దరిచేరినీయకుండా చేసేందుకు వివిధ రకాల చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలను ఆరోగ్యంగా ఉంచాలని అన్నారు. వారి ఆరోగ్యం పట్ల తల్లులు జాగ్రత్త వహించాలని కోరారు. పిల్లలు పలుచోట్ల ఆటలాడి దుమ్ము, ధూళితో ఉన్న చేతులతో ఉంటారని అన్నారు. వాటిని సబ్బుతో శుభ్రం చేసుకున్న తర్వాత మాత్రమే భోజనం పెట్టాలని అన్నారు. పిల్లలకు పుష్టికరమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు టీ ప్రసన్న, ఐ .శ్రీలక్ష్మి, పి సుధారాణి, బి శ్యామల, ఆయాలు జ్యోతి, సిహెచ్ ఆమని, సిహెచ్ ప్రసన్నలక్ష్మి, కె రేణుక పాల్గొన్నారు.

చెరుకుపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేతుల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్వ శిక్ష అభియాన్ ఎఎంఒ డాక్టర్ బిల్లా మోజేష్ తెలిపారు. స్థానిక గుల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. చెరుకుపల్లి, పిట్టలవారిపాలెం, కర్లపాలెం మండలాల పరిధిలో ఎంపిక చేసిన 103పాఠశాలల పరిధిలోని ఉపాధ్యాయులకు డెటాల్ బనేగా ఇండియా, సర్వ శిక్ష అభియాన్ సంయుక్తంగా శిక్షణ నిర్వహించారు. ఎంఈఓ పులి లాజర్ అధ్యక్షత వహించారు. ఎస్ఎస్ఎ ఎఎంఒ డాక్టర్ బిల్లా మోజేష్ చేతులు పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు శిక్షణ, అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆటలు ఆడిన తర్వాత, కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత, భోజనం చేసే ముందు, చేసిన తర్వాత తీసుకోవాల్సిన చర్యల పట్ల వాల్ రేటింగ్స్ ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ టి నవీన్ కుమార్, పాఠశాల హెచ్ఎం కవిత, రిసోర్స్ పర్సన్లు రవిరాజు, డేటాల్ బనేగా స్వస్థ ప్రతినిధులు భగవాన్, నలిని, ఉపాధ్యాయులు కాటూరు నాగేశ్వరరావు, ఎల్ చక్రపాణి, కుంచ రామ్మోహనరావు పాల్గొన్నారు.



చేతుల శుభ్రతపై శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

అడుగంటిన భూగర్భ జలాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

బోరు వసతి కలిగిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్ల నుండి నీరు రాక రైతులు నానా అవస్తులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో భూముల్లో రైతులు ఇచ్చిన ఎరువులు కొరకు విత్తనాలు వెదజల్లి బోర్ల ద్వారా నీరు పెడదామని భావిస్తున్నప్పటికీ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



బోరు నిర్మాణానికి తీస్తున్న బావి

వర్షాలు సక్రమంగా లేకపోవడం, ఎండ తీవ్రత కారణంగా రైతులు ఈపాటికే సాగుచేసిన వాణిజ్య పంటలకు నీరు అందక పంటలు మొలక సక్రమంగా రాలేదు. మొలకెత్తినవి ఎదుగుదల లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో పసుపు, కంద పంటను సాగు చేయగా మాగంటి భూములు పచ్చిరొట్ట ఎరువుల కోసం జనుము, పిల్లి పెసర, జీలుగా వంటి విత్తనాలను వెదజల్లారు. వర్షాలు పడితే ఈ విత్తనాలు సకాలంలో సక్రమంగా మొలకెత్తేవని, వర్షం లేకపోయినా బోర్లతోనైనా నీరు పెడదామనుకున్న రైతులకు బోర్ల నుండి గంటకు మించి నీరు అందటం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుండి ఇప్పటివరకు సరైన వర్షాలు లేకపోవడంతో రబీలో సాగుచేసిన జొన్న, మొక్కజొన్న పంటకు కూడా సక్రమంగా నీరు అందించలేకపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దిగుబడులు కూడా 50శాతం పైగా తగ్గిపోయి నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్న బోర్లు తొలగించి కొత్త బోర్ల రికంబాణం

ప్రస్తుతం ఉన్న బోర్ల నుండి సక్రమంగా నీరు అందకపోవటంతో వాటి స్థానంలో సుమారు పది అడుగుల లోతు బావిని తవ్వి ఆ బావిలో మోటర్‌ను ఏర్పాటు చేసి సుమారు 40 అడుగుల మేర బోరును ఏర్పాటు చేస్తున్నారు. దీనివలన రైతుకు అదనపు భారం పడుతుందని చెబుతున్నారు. ఇంత చేసిన బోర్ల నుండి నీరు సక్రమంగా అందుతుందో, లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెల పూర్తికావస్తున్న వర్షాలు సక్రమంగా లేకపోవడం, నదులు, ప్రాజెక్టులు ఒట్టిపోయి ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఏవిధంగా సాగుతుందోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బోరు వసతి ఉన్న గ్రామాలైన వెల్లటూరు, భట్టిప్రోలు, పెద్దపులివర్రూ, గోరిగపూడి, ఓలేరు, సూరేపల్లి, ఆళ్ళమూడి వంటి గ్రామాల్లోనే ఇలాంటి పరిస్థితులు ఎదురైతే బోరు వసతి లేని అద్దేపల్లి, ఐలవరం, కోనేటిపురం, పల్లికోన, రాచూరు వంటి గ్రామాల పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. జులై మాసంలోనైనా వర్షాలు సక్రమంగా పడితే తప్ప ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సజావుగా సాగే పరిస్థితి లేదని రైతుల చెబుతున్నారు.



బోరు కోసం పైపులైను నిర్మాణం చేస్తున్న దృశ్యం

సుచరిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

◆ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను శిక్షించాలి ◆ రూ.50 లక్షల పరిహారం, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

గంజాయి మూకలు, కామాంధుల చేతిలో అత్యంత పాసవికంగా అత్యాచారం, హత్యకు గురైన యువతి సుచరిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని హైమ హాస్పిటల్ ఎండి డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు అన్నారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో బిసి ఫెడరేషన్ నాయకులు ఊటుకూరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాజకీయ పార్టీలు, అభ్యుదయ వాదులు, మేధావుల ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ హైమాసుబ్బారావు మాట్లాడుతు ఈపురుపాలెంలో జరిగిన ఘటన మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోని కోరారు. దొషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. బాధిత కుటుంబలో సుచరిత చెల్లెలికి ప్రభుత్వం తక్షణమే ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. రూ.10లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చి చేతులు దులుపుకొకుండా రూ.50లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హత్యలు చేసి బెయిల్‌పై తిరుగుతున్న నేరస్తులను జన జీవనంలో విచ్చలవిడిగా వదిలేయడం ద్వారానే నేరస్తులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నాడని అన్నారు. సుచరిత కేసులో నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి తక్షణమే శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి అందరూ అండగా ఉండాలని అన్నారు. పాత నేరస్తులను అదుపులో పెట్టాల్సిన అవసరం పోలీసులపై వుందని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకుల సమాచారం మాత్రమే కాకుండా పోలీసులు నెరస్తులపై నిరంతర నిఘు ఉంచి నేరస్తుల కదలికలు తెలుసుకోవాలని అన్నారు. మత్తు పదార్థాలు వాడేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలోచేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మాచర్ల మోహనరావు, కొత్తపేట మాజీ సర్పంచి చుండూరు వాసు, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి కొండయ్య, సూర్య ప్రకాశరావు, చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ నాయకులు శీలం వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు మేడ వెంకటరావు, సామేలు, ప్రసాదు, పుల్లయ్య, జయరాం, ఎలమందయ్యా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు

రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు అవస్థలు

శిథిలావస్థకు చేరిన భవనం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తెనాలి నుండి రేపల్లెకి వెళ్లే రైలు మార్గంలో అత్యంత ప్రధానమైన బట్టిప్రోలు రైల్వే స్టేషన్ భవనం శిధిలావస్థకు చేరింది. స్టేషన్లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రజలు స్టేషన్ నుండి ప్రయాణిస్తూ ఉంటారు. స్టేషన్ నుండి నిత్యం 2వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రేపల్లె నుండి తెనాలి, గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు వ్యాపారులు, ఉద్యోగస్తులతో పాటు నిత్యం భవనిర్మాణ కార్మికులు, ఇతర రంగాల్లో పనిచేసే కూలీలు రైలు మార్గం ద్వారా వెళ్లి పనులు పూర్తి చేసుకుని తిరిగి వస్తుంటారు. రేపల్లె, తెనాలి మార్గంలో భట్టిప్రోలు స్టేషన్ నుండే రైల్వే శాఖకు అత్యధిక ఆదాయం లభస్తుంది. భట్టిప్రోలు నుండి తెనాలి వెళ్లడానికి బస్సు మార్గం ద్వారా దాదాపు గంట సమయం పడుతుంది. కానీ రైలు ద్వారా కేవలం 15 నిమిషాల్లోనే తెనాలి చేరుతుంది. పైగా ఇటీవల రైల్వే చార్జీలు కూడా తగ్గించి భట్టిప్రోలు నుండి తెనాలికి రూ.10 మాత్రమే ఉండటంతో ఎక్కువ మంది రైలు మార్గం ద్వారానే ప్రయాణిస్తుంటారు. అలాంటి ఆదాయం కలిగిన ఈ రైల్వేస్టేషన్‌ను రైల్వే శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలు తిష్ట వేశాయి. రైల్వే ప్లాట్ ఫామ్‌పై మరుగుదొడ్ల సౌకర్యం కరువైంది. మహిళలు, విద్యార్థులు సమయానికి ముందుగా వచ్చి ఉంటే మూత్ర విసర్జనకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది. మహిళలు, షుగరు వ్యాధి గ్రస్థుల పరిస్థితి వర్ణణాతీతంగా ఉంటుంది. త్రాగునీటి ఏర్పాట్లు కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలు లేకపోవడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థలో భట్టిప్రోలు రైల్వే స్టేషన్ ముఖ ద్వారం

పార్కింగ్ స్టాండు లేక గల్లంతవుతున్న వాహనాలు

గతంలో భటప్రోలు రైల్వే స్టేషన్ నిత్యం ప్రయాణికులతో కళకళలాడుతూ ఉండేది. స్టేషన్ బయట హెూటళ్లు, టీ స్టాల్స్ ఉండటమే కాక ద్విచక్ర వాహనాలు నిలుపుకోవటానికి స్టాండ్ కూడా ఉండేది. రైల్వే శాఖ నిబంధనలు మార్పు చేయటంతో స్టేషన్ సమీపంలో ఎలాంటి హెూటల్లు, టీ స్టాల్స్ లేకపోవడమే కాక ఉన్న వాహన స్టాండ్ కూడా ఎత్తివేశారు. దీంతో స్టేషన్‌కు ముందుగా వచ్చేవారు బిక్కు బిక్కు బంటు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనాల స్టాండు లేకపోవడంతో దూర ప్రాంతాల నుండి రైలు మార్గం ద్వారా ప్రయాణించేవారు ద్విచక్ర వాహనాలు ఎక్కడ నిలుపుకోవాలో అర్థం కాక ఏదో ఒక ప్రాంతంలో నిలుపుకొని రైలుకు వెళ్లి తిరిగి వచ్చే సమయానికి దుండగులు వాహనాలను అపహరిస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి.

శిథిలావస్థలో స్టేషన్ భవనం

అత్యంత ప్రాధాన్యత కలిగిన భట్టిప్రోలు రైల్వే స్టేషన్ భవనం ప్రస్తుతం పగుళ్లుతో గోడలపై చెట్లు మొలిచి శిథిలావస్థకు చేరింది. 50ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలవస్థకు చేరటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రైల్వే శాఖ ఆధునీకరణ పేరుతో నిత్యం టెండర్లు కేటాయిస్తూ కాంట్రాక్టర్లకు ఏదో రూపంలో ఆదాయాన్ని సమకూరుస్తుందని, శిథిలావస్థకు చేరుతున్న భవనాలపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వంలో రైల్వే అధికారులు స్పందించి ప్రాధాన్యత కలిగిన భట్టిప్రోలు రైల్వే స్టేషన్‌లో త్రాగునీరు కల్పించడం, మరుగుదొడ్ల నిర్మాణం, సైకిల్ స్టాండ్, నూతన భవన నిర్మాణం వంటి సమస్యలపై దృష్టి సారించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

దళిత కుటుంబంపై దాడి

ప్రజాశక్తి - బాపట్ల

వైసిపి నాయకులు, కాంట్రాక్టర్ కొట్రా ఏడుకొండలు, అతని కుమారుడి చేతిలో దాడికి గురై స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళ తగరపు సువర్ణను దళిత నాయకులు గురువారం పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈనెల 27న తనపై, తన భర్తపై దాడి చేశారని చెప్పారు. తన కుటుంబానికి ఏడుకొండలు, అతని కుమారుడి వలన ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. ఎఎన్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చార్వక పోలీసులను ఘటనపై వివరాలు అడిగినట్లు తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు తెలిపారు. కొట్ర ఏడుకొండలు రాజీవ్ గాంధీ కాలనీలో ఒక స్థలాన్ని కొని ఇంటి నిర్మాణం చేసేటప్పుడు పక్కనే ఉన్న బాధితు రాలి ఇల్లు అడ్డంగా ఉందని 10 నెలల క్రితం అప్పటి ఎంఎల్‌ఎ కోన రఘుపతి అండతో రాత్రికి రాత్రే 50ఏళ్ల క్రితం ప్రభుత్వ పట్టా పొంది నివాసం ఉంటున్న దళిత కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చివేశారనతి తెలిపారు. ఆ స్థలంలో సిమెంటు రోడ్డు కూడా వేశారని అన్నారు. నిరాశ్రయులైన ఆ కుటుంబం పోలీసులను అనేకసార్లు సంప్రదించిన రాజకీయ ఒత్తిళ్లతో న్యాయం జరగలేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అట్రాసిటీ ఆక్టును తమ చేతుల్లోకి తీసుకొని దళితులను అణగదొక్కిందని ఆరోపించారు. టిడిపి అధికారానికి వచ్చిన తరువాత దాడి జరిగిన వెంటనే పోలీసులు స్పందించి ఎఫ్ఐఆర్ కట్టడం హర్షించదగిన విషయమని అన్నారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శీలం రోజం బాబు, మంచాల ఆనంద్ పాల్గొన్నారు.


దళిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దళిత నేత డాక్టర్ చార్వాక

లైన్‌మెన్ మృతి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని గరటయ్య కాలనీలో విద్యుత్ వైర్ల మరమ్మత్తు పనులు చేస్తున్న సమయంలో టౌన్ లైన్మెన్ నగిరి నాగేశ్వరరావుకు గత శుక్రవారం విద్యుత్ షాక్ గురయ్యారు. స్తంభంపై నుండి కింద పడటంతో తీవ్ర గాయాలతో పాటు విద్యుత్ ఘాతం తగలడంతో ఒళ్లంతా కాలిపోయింది. దీంతో క్షతగాత్రున్ని ఒంగోలు కిమ్స్‌కు తరలిం చారు. వైద్య చికిత్సలు అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని అపోలో వైద్యశాలకు తరలించారు. ఇప్పటివరకు చికిత్స అందించినప్పటికీ కోలుకోలేకపోయారు. చికిత్స పొందు తూనే గురువారం మృత్యువాత పడ్డారని సంబంధిత బంధువులు తెలిపారు. మృతుడు పట్టణంలో గరటయ్య కాలనీ, భాగ్యనగర్లో విద్యుత్ విధులు నిర్వహిస్తాడని, సహచరుడు మృతి చెందినట్లు తెలిసిన అనంతరం విద్యుత్తు శాఖ సిబ్బంది, అధికారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.


లైన్మెన్ నగిరి నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ కె సుధీర్‌బాబు

కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎఒ సుధీర్ బాబు కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద రెవిన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్త సమావేశం గురువారం నిర్వహించారు. ఎఒ మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్ కార్డ్, పట్టాదారు పాస్ బుక్, పాస్ ఫోటో నకలు కాఫీలను విఆర్‌ఒలకు అందచేస్తే గుర్తింపు కార్డులు జారిచేస్తారని తెలిపారు. అదేవిధంగా అన్ని గ్రామాల్లో కౌలు రైతులును గుర్తించి సిసిఆర్సి కార్డ్స్ జారి చేసి రైతులకు అందచేయాలని డిప్యూటీ తహశీల్దారు సుశీల రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన విఆర్‌ఒలు, వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలో రైతుల వద్ద పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేసే కౌలు రైతులు గ్రామాల్లోని ఆర్‌బికె వద్ద, వీఆర్వోల వద్ద కౌలు రైతు కార్డులు నమోదు చేసుకోవాల్సిందిగా తహశీల్దారు టీ ప్రశాంతి తెలిపారు. మండల పరిషత్ సమావేశం హాల్ నందు ఆర్‌బికె సిబ్బంది, వీఆర్వోలకు కౌలు రైతు కార్డులు మంజూరు విషయంపై గురువారం సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు ఎవరెన్ని కౌలు రైతుల కార్డులు నమోదు చేయాలో టార్గెట్ నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మండలంలో 3500 కౌలు రైతుల కార్డులు టార్గెట్ ఉండగా ఈపాటికే 382కౌలు రైతు కార్డులు పూర్తి చేసినట్లు ఎఒ లావణ్య తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు గాను కౌలు రైతులు గుర్తింపు కార్డుల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దారు ఐ ముని లక్ష్మి సూచించారు. మండ లానికి 5,430 కార్డులు అందించా లనే లక్ష్యాన్ని ఉన్నతా ధికారుల నుండి ఆదేశాలు అందాయని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల వీఆర్వోలకు టార్గెట్లు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు లభించే విధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈపాటికే ఆ గ్రామాల వీఆర్వోలు కౌలు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుర్తింపు కార్డు పొందటం ద్వారా పంట నష్టపరిహారాలు ఎరువులు, పురుగు మందులు రాయితీపై పొందటానికి దోహదపడతాయని అన్నారు.

ఇద్దరు నేరస్తులకు ఐదేళ్ల కారాగార శిక్ష

ప్రజాశక్తి - వేటపాలెం

మహిళను ఆత్మ హత్యకు ప్రేరేపించిన కేసులో ఇద్దరు నేరస్తులకు కోర్టులో ఐదేళ్ల కారాగార శిక్ష పడినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. స్థానిక రెడ్లలొంపకు చెందిన కంజుల అంజమ్మ తనకు రావాల్సిన అప్పు అడగడానికి వెళ్లిన సమయంలో ముద్దాయిలు అవమానించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఆమె కొడుకు కంజుల మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై షేక్ మస్తాన్ షరీఫ్ కేసు నమోదు చేసి ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో 3వ నేరస్థురాలు రోశమ్మ అనారోగ్య కారణంతో మూడేళ్ల క్రితం చనిపోయినది. చీరాల అడిషనల్ సెషన్స్ కోర్టులో గురువారం విచారించారు. ఎస్సై జి సురేష్ సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి కోర్ట్ కానిస్టేబుల్ పి శ్రీనివాసరావు ద్వారా కోర్టులో హాజరు పర్చారు. ఎపీపీ పి పద్మజ సరైన వాదనలు వినిపించి నేరాన్ని సాక్షాదారాలతో నిరూపించారు. న్యాయమూర్తి ఎం సుధా నేరస్తులు ఇద్దరికీ ఐదేళ్ల కారాగార శిక్ష, జరిమానాను విధించారని ఎస్‌పి తెలిపారు.

బావిలో పడ్డ చిరుత పులి

ఎట్టకేలకు బంధించిన అటవీ శాఖాధికారులు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

మండలంలోని దేవనగరం గ్రామం పరిధి పేపర్‌మిల్లు ప్రాంతంలోని పొలాల్లో పాడుబడ్డ బావిలో ప్రమాదవశాత్తూ గురువారం ఓ చిరుత పులి జారి లోతైన బావిలో పడింది. బావిలో పడ్డ చిరుత పులి గాండ్రింపుతో పొలాల్లోని రైతులు ప్రజలు బావి దగ్గరకెళ్లి చూడగా.. పులి కనిపించింది. స్థానిక ప్రజలు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. గిద్దలూరు అటవీశాఖ అధికారులు సంఘటనాస్థలాన్ని చేరుకొని చిరుత పులి పైకి ఎక్కి రాకుండా వల వేశారు. నల్లమల అడవుల్లో నుండి పులి ఈ ప్రాంతం వచ్చి ఉంటుందని ప్రజలు అటవీశాఖ అధికారులు అనుకున్నారు. చీకటి పడటంతో అటవీ శాఖ అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగిపోయారు. ఆ ప్రాంత ప్రజలంతా పులిని తలచుకుంటూ రాత్రంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. బావిలో పడ్డ పులిని చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. గురువారం ఉదయానికి తిరుపతి నుంచి అటవీశాఖ స్పెషల్ రెస్క్యూ టీం వచ్చి పులిని బయటకు తీసే ప్రయత్నం కొనసాగుతుంది. దాదాపు 50



అటవీ శాఖాధికారులు బంధించిన చిరుత

మంది ఫారెస్ట్ అధికారులు ఈ ఆపరేషన్‌లో నిమగ్నమై ఉన్నారు. పులిని బయటికి తీసే ప్రయత్నంలో పులికి ఒక మేకను కోళ్లను మంచినీళ్లను ఆహారంగా అందిస్తున్నారు. గిద్దలూరు ఫారెస్ట్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు సంఘటనా స్థలంలో ఉండి పులిని బయటికి రప్పించే ప్రయత్నంలో ఉన్నారు. గురువారం రాత్రి ఎట్టకేలకు పులిని బోనులో బంధించారు. దీనిని నల్లమల పారెస్టు అడవులలో వదిలేస్తామని డీడీ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి

రైతాంగం పోరాటాలకు సిద్ధం కావాలి

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-పంగులూరు

రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం రైతులు పోరాటం చేయవలసిన అవసరం ఉందని, పంగులూరు మండలంలో పోరాటాలకు రైతులు సిద్ధం కావాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం పంగులూరులో రైతుసంఘం సీనియర్ నాయకులు మానం హరిబాబు అధ్యక్షతన జరిగిన మండల రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రధాన కాలువలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, మేజర్ కాలువల్లో ఉన్న చెట్లను తొలగించి, సాగునీటి పారుదలకు అనువుగా కాలువ రిపేర్లు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సాగర్ కాలువల ద్వారానే కాకుండా, భవనాసి రిజర్వాయర్ ,పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో సాగునీటికి అవకాశాలు ఉన్నాయని, ఆ రెండు ప్రాజెక్టులు ప్రభుత్వం త్వరగతిన పూర్తి చేయాలని, ఇందుకోసం మండల రైతాంగం ఉద్యమించా లని కోరారు. సాగుకు అనుకూలమైన అవకాశాలు ఉన్నప్పటికీ



రైతులతో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రభుత్వ విధానాలు పాలకుల నిర్లక్ష్యం కారణంగానే మండలంలో వ్యవసాయం వెనుకబడి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో 70 శాతం మంది కౌలు రైతులు ఉన్నప్పటికీ, కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. పంగులూరు మండలంలో పదివేల మందికి పైగా కౌలు రైతులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం 3200 మందికి మాత్రమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించిందని, దీని వల్ల కౌలు రైతులకు ప్రభుత్వం నుండి రావలసిన అనేక రాయితీలు వచ్చే అవకాశం లేదని చెప్పారు. రాష్ట్రంలో కూడా గత ఐదు సంవత్సరాల్లో 6 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. రైతు సంఘం జిల్లా నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ పంగులూరు మండలంలో సాగునీటి మోటార్లకు విద్యుత్ మీటర్లను బిగించే పనిని ప్రభుత్వం చేస్తుందని, ఇందులో భాగంగానే రామకూరు గ్రామంలో కొన్ని మోటార్లకు మీటర్లు బిగించారని చెప్పారు. రైతాంగం దీనికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో పోరాడాలని సూచించారు. రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ రైతుసంఘం ప్రతినిధులు గ్రామాల్లో సంఘం బలోపేతానికి కృషి చేయాలని, ఇందుకోసం జనరల్ బాడీలు నిర్వహించి గ్రామ కమిటీలు కూడా వేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుడిపాటి మల్లారెడ్డి, గరికపాటి శంకర్, నాదెళ్ల శ్రీనివాసరావు, మద్దినేని సురేష్, వెంకటరావు, ఆంజనేయులు, కరణం రామయ్య, చిలుకూరి శేఖర్, నాయపాము ప్రభాకర్‌రావు, ఇంటూరి శ్రీనివాసరావు, తానికొండ సుధాకర్ రావు తలపనేని సుధాకర్ రావు, రాయని సుబ్బారావు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను

సద్వినియోగం చేసుకోవాలి

ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పిలుపునిచ్చారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టులలో జూన్ 29న శని వారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిం చడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. నోటీ సులు అందిన కక్షిదారులు వారి కేసులను జాతీ య లోక్‌అదాలత్‌లో రాజీ మార్గంలో పరిష్కరిం చుకునేందుకు ముందుకు రావాలని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి జాతీయ లోక్‌అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులు పరిష్కరించు కోవాలని తెలిపారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన లోక్‌అదాలత్ ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని సద్వినియోగం చేసుకోవా లని ఎస్పీ సూచించారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి: డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అతిసార వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ సూచించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సూచించిన నివారణ పద్ధతులను పాటించాలని కోరారు. అతిసార వ్యాధి నివారణ, సహాయం కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అత్యవసర విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ విభాగం 24 గంటలు పనిచేస్తుందని, 9515324799 మొబైల్ నెంబర్‌కి ఫోన్ చేయాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలందరూ వినియోగించు కోవాలని డిఎంహెచ్‌ఒ కోరారు.

శ్రీరామ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో

3 వేల నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

డాక్టర్ చాపల వంశీకృష్ణ సహకారంతో ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొత్తపట్నం పల్లెపాలెం గ్రామంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులం దరికీ మొత్తం 3 వేల నోటు పుస్తకాలను బుధవారం డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి దంపతులు పంపిణీ చేశారు. ఈ నోటు పుస్తకాలను ప్రతిభ కనబరి చిన విద్యార్థుల ఫొటోలతో ప్రత్యేకంగా తయారు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త పట్నం పల్లెపాలెం నార్త్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ పేదరి కాన్ని జయించడానికి చదువే ఆయుధమని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని బలంగా నమ్మి "అందరూ చదవాలి - అందరూ ఎదగాలి" అనే ఉద్దేశంతో గ్రామంలో విద్యాభివృద్ధి కోసం 2015 నుండి వివిధ విద్యా సంబంధిత కార్యక్రమాలను చేపట్టి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉప విద్యా శాఖ అధికారి అనిత రోజారాణి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల కోఆర్డినేటర్ చాప్ల వినుకొండయ్య, మండల విద్యా శాఖాధికారి పద్మావతి, హైస్కూల్ హెడ్మా స్టర్ శ్రీదేవి, మూడు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మస్తాన్, కష్ణ ప్రసాద్, తిరుమలాబి, ఉపాధ్యాయులు కొక్కిలిగడ్డ సుబ్బా రావు, నాగేశ్వర రావు, హాస్పిటల్ సిబ్బంది నాగరాజు, శ్యామ్, చిరంజీవి పాల్గొన్నారు. ముం దుగా నోటు పుస్తకాలను శ్రీరామ్ హాస్పిటల్ ప్రముఖ హైరిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ చాపల శాంతకుమారి, శ్రీరామ్ హాస్పిటల్ వైద్య బందం డాక్టర్ వంశీకష్ణ, డాక్టర్ సానల ధీరజ్‌బాబు, డాక్టర్ మౌనిక రెడ్డి, డాక్టర్ జెరూషా జాస్మిన్, డాక్టర్ సరయు, డాక్టర్ ఏడు కొండలు, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ కుమార్ వర్మ ఆవిష్కరించారు.



పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్లు వంశీకృష్ణ, శాంతకుమారి

30న ఏడుగుండ్లపాడులో

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-మద్దిపాడు

మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య, ఆలా చెంచయ్యల జ్ఞాపకార్థం ప్రజాశక్తి దినపత్రిక సౌజన్యంతో శ్రీరామ్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని ఏడుగుండ్లపాడులో ఈ నెల 30న ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.బాలచంద్రం, దండు అంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుగుండ్లపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 7 గంటలకు మెడికల్ క్యాంప్ ప్రారంభమవుతుందన్నారు. ఈ శిబిరంలో థైరాయిడ్, ఎముకల పటుత్వ పరీక్ష, ఈసీజీ, బీపీ, షుగర్, పాదాల స్పర్శ పరీక్షతో పాటు రక్తపరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా అందజేస్తారని పేర్కొన్నారు.

రామోజీ జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పద్మవిభూషణ అవార్డు గ్రహీత, ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు జీవితం ఎందరికో ఆదర్శమని పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ అన్నారు. రామోజీ రావు సంస్మరణ సభ గురువారం శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంతపేటలోని శివం శరణాలయంలో జరిగింది. రామోజీరావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశ్రామికవేత్త మురళీకృష్ణ మాట్లాడుతూ పత్రికా రంగంలో నూతన ఒర ఒడిని సృష్టించిన వ్యక్తి రామోజీరావు అని తెలిపారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, జెమిని శ్రీనివాసరావు, మన్నం శేషయ్య, రావిపాటి జగదీష్ పాల్గొన్నారు. తరువాత పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!



ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ